క్లుప్తంగా

108 అంబులెన్సుల్లో ఉద్యోగాలకు దరఖాస్తులు ఆహ్వానం

గుంటూరు మెడికల్: అరబిందో ఎమర్జెన్సీ మెడికల్ సైన్సెస్ 108 అంబులెన్సుల్లో ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్‌గా పనిచేసేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు 108 జిల్లా మేనేజర్ జి.నాగదీప్ తెలిపారు. బీఎస్సీ బయాలజీ, బీజెడ్ సీ, బీఎస్సీ నర్సింగ్, జీఎన్ఎం, బయోకెమిస్ట్రీ మైక్రోబయాలజీ, బీఫామ్‌సీ, డీఎంఎల్టీ చదివిన వారు ఉద్యోగాలకు అర్హులని చెప్పారు. అభ్యర్థుల వయస్సు 35 సంవత్సరాల్లోపు ఉండాలని, ఉద్యోగానికి ఎంపికైన వారు తెనాలి, మంగళగిరి, వట్టిచెరుకూరు, తుళ్లూరు, ఫిరంగిపురం, గుంటూరు ప్రాంతాల్లో పనిచేయాల్సి ఉంటుందన్నారు. పూర్తి వివరాలకు గుంటూరు డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో రెండో అంతస్తులోని 108 కార్యాలయంలో 9121892889 ఫోన్ నంబరులో సంప్రదించాలన్నారు.

నేడు విద్యుత్ నిలిపివేత

ఫిరంగిపురం: విద్యుత్ మరమ్మతుల దృష్ట్యా గురువారం సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ పుల్లారెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫిరంగిపురం, గొల్లపాలెం, రేపూడి, వేమవరం, 113.తాళ్లూరు, శిరంగిపాలెం తక్కెళ్లపాడు, గరుడాచలపాలెం గ్రామాల్లో ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరా ఉండదని చెప్పారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

బీసీజీ వ్యాక్సిన్‌పై అవగాహన

ఫిరంగిపురం: బీసీజీ వ్యాక్సిన్‌పై ఆరోగ్య సిబ్బందికి ఫిరంగిపురంలోని అర్బన్ హెల్త్‌సెంటర్‌లో వీడియో కాన్ఫరెన్స్ బుధవారం నిర్వహించారు. టీబీ జాయింట్ డైరెక్టర్ తాళ్లూరు రమేష్ మాట్లాడుతూ ఏఏ వయస్సు వారికి టీబీ వ్యాక్సిన్ వేయాలో వివరించారు. షుగర్ బాధితులు, 60 ఏళ్లకు పైబడినవారు, గతంలో టీబీ సోకి చికిత్స పొందుతున్నవారు, వారితోపాటు వారి ఇంటిలోని వారు, 18 కిలోల కన్నా తక్కువ ఉన్నవారు, బీడీ, సిగిరెట్లు అలవాట్లు ఉన్నవారు బీసీజీ వ్యాక్సిన్ వేయించుకోవచ్చని చెప్పారు. అదే విధంగా 18 ఏళ్లలోపు ఉన్న వారు, హెచ్‌ఐవీ బాధితులు, గర్భిణులు, గుండె సంబంధిత చికిత్స పొందుతున్నవారు, కేన్సర్ బాధితులు, జ్వరం వస్తున్నవారు, రక్తదానం మూడు నెలల కిందట చేసినవారు దీనికి అనర్హులుగా తెలిపారు. కార్యక్రమంలో ఫిరంగిపురం పీహెచ్‌సీ, నుదురుపాడు పీహెచ్‌సీ వైద్యులు యానీగ్రేస్, ఎస్తేరురాణి, శ్వేత, ఫరీనాబేగంలు, సీహెచ్‌ఓలు వెంకటలక్ష్మి, వెంకటరమణ, పీహెచ్‌ఎన్ గాయత్రీదేవి, హెచ్‌వీలు నూర్‌న్నీసా, అన్నమేరి పాల్గొన్నారు.

213 మందికి వైద్యపరీక్షలు



ఫిరంగిపురం: మండలంలోని గరుడాచలపాలెంలో ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్‌లో భాగంగా బుధవారం ఫిరంగిపురం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించారు. గుంటూరు నుంచి వచ్చిన వైద్యుడు 213 మందికి పరీక్షలు చేసి మందులు అందజేశారు. వేసవిలో వడదెబ్బతగలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. చలివేంద్రాలు వద్ద, ఆశ కార్యకర్తలు, అంగన్‌వాడీ కేంద్రాల వద్ద ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. వడదెబ్బ తగిలిన వారు ఓఆర్ఎస్ నీటిలో కలుపుకొని తాగాలన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్ఆర్ఎం స్టూడెంట్ కౌన్సిల్ ప్రెసిడెంట్‌గా లక్ష్మణ్



మంగళగిరి: మండలంలోని నీరుకొండలోని ఎస్ఆర్ఎం యూనివర్సిటీ నూతన స్టూడెంట్ కౌన్సిల్ ప్రెసిడెంట్‌గా కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ ఫైనల్ బీటెక్ లక్ష్మణ్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు నిర్వాహకులు తెలిపారు. బుధవారం యూనివర్సిటీ ఆడిటోరియంలో 2024–25 విద్యాసంవత్సరానికి నూతన కౌన్సిల్‌ను ఎన్నుకున్నారు. ప్రెసిడెంట్‌గా లక్ష్మణ్, వైస్ ప్రెసిడెంట్‌గా సీఎస్ఈ మూడో సంవత్సరం విద్యార్థి నివేదా శ్రీరామ్, ప్రధాన కార్యదర్శిగా వేముల అంకితరెడ్డి, కోశాధికారిగా రిషబ్ రంజన్లు ఎన్నికైనట్లు తెలిపారు. ఏడాది కాలం పాటు కౌన్సిల్ కొనసాగుతుంది. ఇప్పటి వరకు కొనసాగిన కౌన్సిల్ నూతన కౌన్సిల్‌కు బాధ్యతలు అప్పగించగా పరిచయ కార్యక్రమంలో వీసీ డాక్టర్ మనోజ్ ఆరోరా, రిజిస్ట్రార్ డాక్టర్ ప్రేమ్‌కుమార్, కమ్యూనికేషన్ డైరెక్టర్ పంకజ్, సీఎఫ్ఏఓ సుమ, డీన్ డాక్టర్ భరద్వాజ్ హాజరై నూతన కమిటీకి అభినందనలు తెలిపారు.

బంగారం చోరీపై ఫిర్యాదు

నగరంపాలెం: ఇంట్లో దాచిన బంగారు వస్తువులు దొంగిలించారంటూ బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదుపై పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేశారు. కోబాల్టుపేటకు చెందిన మరియమ్మ ఇంట్లో దాచిన 120 గ్రాముల బంగారం వస్తువులు దొంగలించినట్లు బుధవారం ఫిర్యాదులో చేశారు. ఈ చోరీ ఫిబ్రవరి నెలలో పగలు జరిగిందని తెలపగా కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఓటు వేయని జనాభా లక్షల్లో

- నడవలేని వృద్ధులు సైతం ఆసరాతో వచ్చి ఓట్లు వేసిన వైనం
- గుంటూరు అర్బన్‌లో ఓటు వేయని వారు 1,67,132 మంది
- ఓటు వేయని జాబితాలో యువత ఉండవచ్చు
- నా ఒక్కడి ఓటు వేయకుంటే ఏమీకాదనుకోవడం పొరపాటే
- సమర్థవంతమైన పాలన అందించే నాయకుడ్ని ఎన్నుకోవడానికి ప్రతి ఒక్కరి ఓటు అమూల్యమే

ఓటు గురించి / ఓటు హక్కు గురించి అధికారులు, పత్రికలు, చానల్స్, సోషల్ మీడియా ఎన్నో విధాలుగా ఓటర్లకు తెలియచేసింది. కానీ ఫలితం మాత్రం ఆశించిన మేర లభించ లేదు. ఉపాధుల నిమిత్తం వేర్వేరు ప్రాంతాలకు వెళ్లినా తమ సొంత గ్రామంలో ఉన్న ఓటు వేసేందుకు ఎంతో మంది వచ్చారు. అయితే స్థానికంగా ఉన్న చాలా మంది ఆ హక్కును వినియోగించుకోకపోవడం బాధాకరమే. ఒక్క గుంటూరు నగరంలోని రెండు నియోజకవర్గాల ఓటింగ్ శాతాన్ని పరిశీలన చేస్తే లక్షన్నర పైచిలుకు ఓటర్లు ఓటు వేయకుండా మిన్నకుండిపోయారన్న విషయం గమనించవచ్చు. ప్రతివారు ఓటు హక్కు వినియోగించుకుంటేనే అసమర్థులు పాలకులుగా కాకుండా సమర్థుడైన నాయకుడి చేతికి పగ్గాలు వెళతాయి. సమర్థవంతమైన పాలనా వారికి అందుతుంది.



ఓటు వేసేందుకు వీల్ చైర్‌లో పోలింగ్ బూతు వద్దకు వస్తున్న వృద్ధురాలు (ఫైల్)

నెహ్రూనగర్: '' గుంటూరు నగరానికి తరుణ్ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ హైదరాబాద్‌లో పనిచేస్తున్నాడు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో మే 13న వేతనంతో కూడిన సెలవు దినం ప్రకటించడంతో హైదరాబాద్ నుంచి ఓటు వేసేందుకు గుంటూరు వచ్చాడు. ఉదయం 8 గంటలకు పోలింగ్ బూత్ వద్దకు వచ్చాడు. అయితే క్యూలైన్ చాలా పెద్దగా ఉండటంతో మళ్లీ వెళ్లి వద్దాంలే అని ఇంటికి వెళ్లాడు. సాయంత్రం 5 గంటలకు మళ్లీ పోలింగ్ బూత్ వద్దకు వచ్చాడు. క్యూలైన్ ఏ మాత్రం తగ్గకపోవడంతో నా ఒక్కడి ఓటు వేయకపోతే గెలిచేవారు.. గెలవకపోతారా అని మనస్సులో అనుకుని అక్కడి నుంచి ఇంటికి వెళ్లిపోయాడు''.

అర్బన్‌లో 1,67,132 మంది ఓటు వేయలేదు!

గుంటూరు తూర్పు నియోజకవర్గంలో మొత్తం ఓటర్లు 2,50691, ఇందులో పురుషులు 1,21,849 మంది గాను 86,255 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. మహిళలు 1,28,808 ఉండగా వీరిలో 90,386 మంది ఓటు వేశారు. ఇతరులు 34 మందికి గాను 11 మంది తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఈ జాబితాలో ఓట్లు వేయని పురుషులు 35,594 మంది, మహిళలు 38,422 మంది, ఇతరులు 23 మంది ఉన్నారు. పోలింగ్ 70.02 శాతంగా నమోదైంది.

గుంటూరు పశ్చిమలో...

గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో మొత్తం 2,78158 మంది ఉన్నారు. వీరిలో పురుషులు 1,35,426 మందికి గాను 89,844 మంది మాత్రమే ఓటు వేశారు. మహిళలు 1,42,688 ఉంటే వీరిలో 95,211 మంది ఓటు వేశారు. ఇతరులు 44 మంది ఉండగా 10 మాత్రమే ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఈ జాబితాలో ఓట్లు వేయని పురుషులు 45,582, మహిళలు 47,477 మంది, ఇతరులు 34 మందిగా ఉన్నారు. పోలింగ్ శాతం 66.24 శాతంగా నమోదైంది

నడవలేని వృద్ధులు సైతం...

నడవలైని వృద్ధులు, దివ్యాంగులు సైతం వీల్ చైర్ మీదనో, ఆటోల్లోనో, ద్విచక్ర వాహనాల మీద వచ్చి తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. కానీ చాలా మంది యువత, మహిళలు, పురుషులు ఓటు హక్కు వినియోగించుకోకుండా ఇళ్లల్లో టీవీలకే పరిమితమయ్యారనే చెప్పుకోవచ్చు. కొంత మంది అనారోగ్య కారణంగా ఆసుపత్రుల్లో, ఇతర అత్యవసర పరిస్థితుల్లో రాని వారు ఉంటే వారికి మినహాయింపు ఇచ్చిన అంతా సవ్యంగా ఉండి ఏదో ఎన్నికల రోజు సెలవు ఇచ్చారు కదా... మనం ఓటు వేయకపోతే గెలిచే వారు.. గెలవకపోతారా అనుకుంటూ ఇంటిలో ఉంటే సమర్థవంతమైన పాలన అందించే నాయకుడ్ని ఎన్నుకోకపోవడం అసమర్థతే అవుతుంది. ప్రజాసామ్యంలో ఓటు హక్కు కలిగిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవడం ద్వారా మంచి పాలన అందించేందుకు ఊతమవుతుంది. ప్రతి ఓటు అమూల్యమైనదే.

మొత్తం ఓటర్ల వివరాలు

గుంటూరు తూర్పు నియోజకవర్గం	పురుషులు	మహిళలు	ఇతరులు
	1,21,849	1,28,808	34
ఎన్నికల్లో ఓటు వేసిన వారు	86,255	90,386	11
గుంటూరు పశ్చిమ నియోజకవర్గ	పురుషులు	మహిళలు	ఇతరులు
	1,35,426	1,42,688	44
ఎన్నికల్లో ఓటు వేసిన వారు	89,844	95,211	10

కృష్ణబాబు కాలనీలో ఇరువర్గాల ఘర్షణ

నగరంపాలెం: స్థానిక కృష్ణబాబు కాలనీలో మంగళవారం రాత్రి ఇరువర్గాల మధ్య వివాదం జరిగింది. నగరంపాలెం పోలీసుల కథనం ప్రకారం.. కాలనీకి చెందిన ప్రభు, మున్నా మధ్య స్వల్ప విషయమై గొడవకు దారి తీసింది. ఈ క్రమంలో ఇరువర్గాలు దాడులకు ఒడిగట్టారు. ఈ దాడిలో గాయపడిన షేక్. మున్నాతోపాటు పలువురిని చికిత్స నిమిత్తం జీజీహెచ్‌లో చేర్పించారు. నగరంపాలెం పీఎస్ సీఐ మధుసూధనరావు, సిబ్బందితో ఘటనా స్థలానికి, ఆసుపత్రి వద్దకు చేరుకుని వివరాలు సేకరించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు. దాడికి పాల్పడిన పలువురు పోలీసుల అదుపులో ఉన్నట్లు సమాచారం.

గుర్తు తెలియని మహిళ మృతి



చేబ్రోలు: చేబ్రోలు మండలం నారాకోడూరు గ్రామ శివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని మహిళ మృతి చెందిన సంఘటనపై బుధవారం పోలీసులు కేసు నమోదు చేశారు. సుమారు 60 ఏళ్ల వయసు గల మహిళ తల, ముఖంపై గాయాలు ఉండటంతో గుర్తు తెలియని వాహనం ఢీ కొని ఉంటుందని పోలీసులు అనుమానిస్తున్నారు. నారాకోడూరు –బుడంపాడు గ్రామాల మధ్య మిత్ర దాబా సెంటర్‌కు ఎదురుగా అర్ధరాత్రి సమయంలో మహిళ మృతదేహం ఉన్నట్లు సమాచారంతో పోలీసులు సంఘటనా ప్రాంతానికి చేరుకొని వివరాలు నమోదు చేసుకున్నారు. మృతురాలు యాచకురాలుగా పోలీసులు అనుమానిస్తున్నారు. మృతి చెందిన గుర్తు తెలియని మహిళ ఆచూకీ తెలిసిన వారు చేబ్రోలు పోలీసు స్టేషన్‌లో సంప్రదించాలని స్థానిక ఎస్ఐ పి మహేష్ కుమార్ తెలిపారు.

మన చేతుల్లోనే కుటుంబ వ్యవస్థ

లక్ష్మీపురం: ప్రపంచం ఎంతగా మారుతున్నప్పటికీ మన కుటుంబ వ్యవస్థను కాపాడుకునే అవకాశం మన చేతుల్లోనే ఉందని, నా బలగమే నా బలం అని గుర్తించిన వారికి కుటుంబమే స్వర్గం అవుతుందని సంగీత విద్వాంసుడు వి.ఎస్.ఎన్ మల్లేశ్వరరావు అన్నారు. స్థానిక అరండల్ పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో బుధవారం అంతర్జాతీయ కుటుంబ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవత్వ మనుగడ సాధనలో కుటుంబ వ్యవస్థ ప్రధాన పాత్ర పోషిస్తోందనీ, నేటి నవ తరానికి సామాజిక ఆర్థిక సంరక్షణకు క్రమ శిక్షణకు అవసరమైన సంస్కారాలను విలువను అందించటానికి కుటుంబమే ప్రధాన సాధనమన్నారు. విద్యావేత్త ఆర్.వి.సింగరయ్య, సంస్థ కార్యదర్శి కొండాశివ రామిరెడ్డి తదితరులు ప్రసంగించారు.



మాట్లాడుతున్న సంగీత విద్వాంసుడు వి.ఎస్.ఎన్.మల్లేశ్వర రావు, పక్కన సంస్థ సభ్యులు

పొన్నూరులో ప్రజారంజక పాలన చూపిస్తా

- వెంట నడిచిన ప్రతి కార్యకర్తకూ రుణపడి ఉంటా
- పొన్నూరులో మహిళా ఓటింగ్ పెరగటం శుభ సూచకం
- అసెంబ్లీ అభ్యర్థి అంబటి మురళీకృష్ణ

పొన్నూరు: ఎన్నికల ప్రచారంలో మండుటెండలో నా వెంట నడిచారు. ఎంతో ఆదరాభిమానాలు చూపారు. నా గెలుపు మీ విజయంగా భావించి ప్రచారం చేశారు. మీ అందరికీ రుణపడి ఉంటానని వైఎస్సార్ సీపీ పొన్నూరు ఎమ్మెల్యే అభ్యర్థి అంబటి మురళీకృష్ణ అన్నారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో బుధవారం నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. తన రాజకీయ ప్రస్థానం పొన్నూరులో ప్రారంభం కావడం ఎంతో సంతోషాన్ని కలిగిస్తోందన్నారు. జూన్ 4 తర్వాత పొన్నూరులో ధర్మ పరిపాలన తీసుకువస్తానని అన్నారు. సీఎం జగన్ అందించిన పథకాలకు ఆకర్షితులైన ప్రజలు 90 శాతం మంది వైఎస్సార్ సీపీకి అండగా నిలిచి ఓటేశారని బలంగా నమ్ముతున్నానని అన్నారు. ఓటింగ్ సరళిని పరిశీలిస్తే వైఎస్సార్ సీపీ సునాయసంగా గెలవనుందని జోస్యం చెప్పారు. రాష్ట్రంలో 142 నుంచి 160 స్థానాల్లో పార్టీ విజయఢంకా మోగించనుందని పేర్కొన్నారు.



మాట్లాడుతున్న అంబటి మురళీకృష్ణ

పొన్నూరులో మహిళలు అధికశాతంలో ఓటేసి ప్రభుత్వంపై తమ అభిమానాన్ని చాటారని వెల్లడించారు. ఇక్కడ టీడీపీ నాయకుల మైండ్ గేమ్ పని చేయలేదన్నారు. రిగ్గింగుకు పాల్పడేందుకు ప్రయత్నించినా ఫలితం దక్కలేదన్నారు. అధికారులు, పోలీసులు ఎంతో బాధ్యతగా పని చేసి ఎన్నికలు సజావుగా సాగటంలో బాధ్యతగా వ్యవహరించారన్నారు. సమావేశంలో ఏఎంసీ చైర్మన్ ఆకుల వెంకటేశ్వరరావు, నాయకులు బొనిగల వేణుప్రసాద్, వడ్రాణం ప్రసాద్, బొద్దులూరి రంగారావు, అంబటి వెంకటేశ్వరరావు, గేరా సంజీవ్, షేక్ షర్మిల, అమిరినేని సాంబశివరావు, షేక్. జానిబాష, సుభాని, నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కృష్ణానదిలో గుర్తుతెలియని మృతదేహం

తాడేపల్లిరూరల్: ప్రకాశం బ్యారేజ్ కృష్ణానది ఎగువ ప్రాంతంలో నీటిలో మృతదేహం ఉన్నట్లు బుధవారం సాయంత్రం తాడేపల్లి పోలీసులకు మత్స్యకారులు సమాచారం ఇచ్చారు. ఎస్ఐ రమేష్ ఘటనా స్థలానికి వెళ్లి కృష్ణానది ప్రకాశం బ్యారేజ్ 6వ గేట్ వద్ద ఉన్న వ్యక్తి మృతదేహాన్ని బయటకు తీయించి పరిశీలించారు. మృతుడి వద్ద ఎటువంటి గుర్తింపు కార్డులు లేకపోవడంతో గుర్తుతెలియని మృతదేహంగా కేసు నమోదు చేశారు. మృతుడు తెల్లచొక్కా, బ్లూ జీన్స్ ధరించి ఉన్నాడని, ఎవరైనా మృతదేహాన్ని గుర్తిస్తే తాడేపల్లి పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఎస్ఐ కోరారు.

తల్లి ఇంటికి నిప్పుపెట్టిన కుమార్తె

తెనాలి రూరల్: కుటుంబ కలహాల నేపథ్యంలో ఓ కుమార్తె తల్లి ఇంటికి నిప్పు పెట్టిన వైనం ఇది. పోలీసుల కథనం మేరకు చెంచుపేట ఎమ్మెల్యే బజారులో తన ఇద్దరు మనవరాళ్లతో కలసి ఓవృద్ధురాలు పూరింట్లో నివాసం ఉంటోంది. సదరు వృద్ధురాలి కుమార్తె మున్నంగి సుజాత, తన మేనల్లుడు, మరో వ్యక్తితో కలసి మంగళవారం రాత్రి తన తల్లి నివసించే ఇంటికి నిప్పు పెట్టింది. స్థానికులు మంటలను ఆర్పే ప్రయత్నం చేసినా ఆగలేదు. దీంతో అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి మంటలను అదుపు చేశారు. వృద్ధురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు త్రీ టౌన్ పోలీసులు బుధవారం తెలిపారు.

వేసవి శిక్షణ తరగతులు ప్రారంభం

తాడేపల్లిరూరల్: మంగళగిరి– తాడేపల్లి బాలోత్సవం కమిటీ ఆధ్వర్యంలో తాడేపల్లి పట్టణ పరిధిలోని అమరావతి ఐకాన్ కాన్ఫరెన్స్ హాల్‌లో బుధవారం నుంచి వేసవి శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి. కమిటీ రాష్ట్ర కన్వీనర్ మురళీకృష్ణ మాట్లాడుతూ ఈనెల 31వ తేదీ వరకు విద్యార్థులకు లెక్కలు, డ్యాన్స్‌లలో శిక్షణ ఇస్తున్నామని, ఉదయం 9.30 నుంచి 11 గంటల వరకు లెక్కలు, 11 నుంచి 12.30 వరకు డ్యాన్స్ లో శిక్షణ ఇస్తున్నామని చెప్పారు. డాక్టర్ ఎస్. లెనిన్ బాబు, ప్రఖ్యాత డ్యాన్స్ మాస్టర్ చందు శిక్షణ ఇస్తున్నారని, 5,6,7 తరగతులు జూనియర్స్, 8,9,10 తరగతులు సీనియర్స్‌గా విభాగాల్లో శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంటీఎంసీ బాలోత్సవం కోశాధికారి గాదె సుబ్బారెడ్డి, నిర్వాహకులు కల్యాణి, జి.రమ్య, సంధ్యారాణి, ఐజాక్ నూటన్ పాల్గొన్నారు.



పాఠ్యాంశాలను బోధిస్తున్న ఉపాధ్యాయుడు

రైల్వే ఉద్యోగిపై దాడి

తాడేపల్లి రూరల్: రైల్వే ఉద్యోగిపై ముగ్గురు వ్యక్తులు దాడిచేశారు. ఈ నగరపాలక సంస్థ పరిధిలోని వైఎస్సార్ సెంటర్ పశువుల ఆసుపత్రి వద్ద ఉన్న బకింగ్‌హామ్ బ్రిడ్జి దిగువ ప్రాంతంలో బుధవారం చోటుచేసుకుంది. వివరాలు.. తాడేపల్లి కృష్ణాకెనాల్ జంక్షన్ టీఆర్‌డీ డిపార్టుమెంట్‌లో బలమాల హుస్సేన్ పనిచేస్తున్నాడు. విధులు ముగించుకుని బైపాస్ రోడ్డులో వెళుతుండగా వైఎస్సార్ సెంటర్ పశువుల ఆసుపత్రి దిగువ ప్రాంతంలో బకింగ్‌హామ్ బ్రిడ్జిపై ట్రాఫిక్ నిలిచిపోయింది. ద్విచక్ర వాహనం ఆపి నిలబడ్డాడు. ఇదే సమయంలో ఎదురుగా మహిళలు ఉండటంతో మరో వాహనం పక్కకు తీయాలని హుస్సేన్ కోరాడు. అటువైపు నుంచి నడుచుకుంటూ వస్తున్న ముగ్గురు యువకులు ఏంట్రా నువ్వు మాకు చెప్పేదంటూ హుస్సేన్‌తో గొడవకు దిగారు. మిమ్మల్ని కాదని అంటున్నా వినకుండా సిమెంట్ రేకుతో బలంగా తలపై మోదడంతో గాయమైంది. వెంటనే ముగ్గురు అక్కడి నుంచి పరారయ్యారు. సమాచారం అందుకున్న తోటి రైల్వే ఉద్యోగులు హడావుడిగా ఘటనా స్థలానికి చేరుకున్నారు. క్షతగాత్రుడిని విజయవాడ రైల్వే ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించారు.

స్వల్పంగా పెరిగిన ఓటింగ్

తాడేపల్లిరూరల్: మంగళగిరి నియోజకవర్గంలో గతంలో కన్నా ఓటు హక్కు వినియోగించుకున్న వారి శాతం స్వల్పంగా పెరిగింది. మంగళగిరి నియోజకవర్గంలో 2019–2024కు కేవలం 0.29 శాతం మాత్రమే పెరిగింది. 2019 ఎన్నికల్లో మొత్తం 2,28,469 ఓట్లు పోల్ కాగా, నియోజకవర్గ వ్యాప్తంగా 85.45 శాతం నమోదు అయింది. 2024లో 2,50,542 ఓట్లు పోల్ కాగా, 85.74 శాతం మాత్రమే నమోదు అయింది. ఇదిలా ఉండగా మంగళగిరి నియోజకవర్గ వ్యాప్తంగా ఇప్పటి వరకు జరిగిన పోలింగ్‌లో ఓట్ల శాతం ఈ విధంగా ఉంది. 2014లో 89.48 శాతం, 2009లో 80.55, 2004లో 72.45 శాతం, 1999లో 66.21 శాతం, 1994లో 70.24 శాతం, 1989లో 71.27, 1985లో 74.81, 1983లో 70.31శాతం, 1978లో 77.45, 1972లో 71.15, 1967లో 76.83, 1962లో 73.36, 1955లో 74.03, 1952లో 71.16 శాతం నమోదు అయింది. ఎప్పుడు ఎన్నికలు జరిగినా మంగళగిరి నియోజకవర్గంలో ప్రజలు తమ ఓటు హక్కును 70 శాతం మంది పైగానే వినియోగించుకున్నారు. గత ఎన్నికల్లో ఓటింగ్ శాతం పెరిగినప్పుడల్లా వైఎస్సార్ సీపీయే విజయం సాధించింది. తిరిగి మరల వైఎస్సార్ సీపీయే విజయం సాధిస్తుందని వైఎస్సార్ సీపీ నాయకులు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

వృద్ధాశ్రమానికి వృద్ధురాలి తరలింపు

తాడేపల్లిరూరల్: గుంటూరు జిల్లా దుగ్గిరాల మండలం దుగ్గిరాల గ్రామంలో ఓ వృద్ధురాలు శివాలయం సెంటర్ బస్టాండ్ వద్ద ఉండడంతో స్థానికులు జాగృత భారత్ ట్రస్ట్ సభ్యులకు బుధవారం సమాచారం అందించారు. ఈ సందర్భంగా జాగృత భారత్ ట్రస్ట్ ఫౌండర్ పసుపులేటి గణేష్ మాట్లాడుతూ గత 15 రోజుల నుంచి వృద్ధురాలు బస్టాండ్ ఆవరణలో నివాసం ఉంటోందని, కుడిచేతికి గాయం కావడంతో బాధపడుతూ ఉందని, ఆమెకు మతిస్థిమితం లేనట్లు గుర్తించామని, ఆమె పేరు కూడా చెప్పే పరిస్థితిలో లేదని, ఆ వృద్ధురాలిని విజయవాడలోని వృద్ధాశ్రమానికి పంపించామని తెలిపారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు ఆరమండల సుధాకర్, అడపా వెంకటరావు, ఎద్దు సిద్ధూ పాల్గొన్నారు.



వృద్ధురాలిని విజయవాడ వృద్ధాశ్రమానికి తరలిస్తున్న జాగృత భారత్ ట్రస్ట్ నిర్వాహకులు

మాంటిస్సోరిలో విద్యార్థులకు మెరిట్‌స్కాలర్‌షిప్‌లు

తెనాలి రూరల్: తెనాలిలోని మాంటిస్సోరి స్కూల్ 30వ వార్షికోత్సవం సందర్భంగా స్కూలులో నూతనంగా అడ్మిషన్లు తీసుకునే విద్యార్థులకు మెరిట్ స్కాలర్‌షిప్‌లు అందించనున్నట్లు ప్రిన్సిపల్ డాక్టర్ జేమ్స్ మొరెలి బుధవారం తెలిపారు. ఆసక్తి ఉన్న వారు ఈ నెల 16, 17, 18 తేదీల్లో ఉదయం 9.30 గంటలకు పాఠశాలలో నిర్వహించే రాత పరీక్ష, ఇంటర్వ్యూలకు ఏ ఒక్క రోజైనా హాజరవ్వాలని సూచించారు. వివరాలకు 9515847158, 8125412442 నంబర్లలో సంప్రదించాలన్నారు.

ఐదుగురు వ్యక్తులపై అట్రాసిటీ కేసు నమోదు

పెదకాకాని: పోలింగ్‌బూత్‌లో ఏజెంట్‌పై దాడి చేసిన సంఘటనలో ఐదుగురిపై అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. పెదకాకాని మండలం అనుమర్లపూడి గ్రామంలో ఈనెల 13న జరిగిన సార్వత్రిక ఎన్నికలను పురస్కరించుకుని కోడూరి అవినాష్ బూత్ ఏజెంట్‌గా పోలింగ్ బూత్‌లో కూర్చున్నాడు. రాత్రి 10 గంటల తరువాత అతని బావమరిది అత్తోట సన్నిహిత వర్ధన్‌ను కొలకలూరు గ్రామం నుంచి అనుమర్లపూడి తీసుకు వచ్చేందుకు బైక్‌పై వెళ్లాడు.

తిరుగు ప్రయాణంలో మార్గ మధ్యంలో కోడూరి అవినాష్ బంధువులు ప్రసాద్, సురేష్, రవిలతో దానబోయిన గోపి, పృథ్వి, చలమయ్య, నల్లమేకల గోపి, ఆరుదల ఫణీంద్ర మరికొందరు గొడవ పడుతున్నారు. ఆ గొడవను అడ్డుకునేందుకు అవినాష్ అక్కడికి వెళ్లాడు. ఈ వివాదంలో అవినాష్‌పై వారంతా దాడి చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ కె వీరాస్వామి తెలిపారు.

ఇక పురసేవలపై నిమగ్నం

కమిషనర్ బండి శేషన్న

తెనాలి: సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ముగిసిన నేపథ్యంలో మున్సిపల్ సిబ్బంది అందరూ యథావిధిగా తమ తమ విధుల్లో పూర్తిస్థాయిలో నిమగ్నమవుతారని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న తెలిపారు. ప్రజలు ఏమైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావొచ్చని చెప్పారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలోని తన చాంబర్‌లో కమిషనర్ శేషన్న బుధవారం మీడియాతో మాట్లాడారు. గత కొద్ది రోజులుగా సార్వత్రిక ఎన్నికల విధుల్లో నిమగ్నమైన సిబ్బంది, ఇకపై పుర సేవలకు అందుబాటులో ఉంటారని తెలిపారు. ప్రధానంగా పారిశుద్ధ్యంపై దృష్టిని సారించి ప్రజలకు ఇబ్బంది లేకుండా చూస్తామని చెప్పారు.